క్లుప్తంగా

ముద్రగడకు వైఎస్సార్ సీపీ నాయకుల సంఘీభావం


ముద్రగడను కలిసి సంఘీభావం తెలుపుతున్న ఉప్పలగుప్తం నాయకులు

ఉప్పలగుప్తం: వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇంటిపై దాడి చోటు చేసుకున్న క్రమంలో మండలానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఆయనతో పాటు ఆయన కుమారుడు ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ గిరిబాబును కలిసి సంఘీభావం తెలియజేశారు. ముద్రగడను కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జున్నూరి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ శీలం సూరిబాబు, సుంకర చిన్నా ఉన్నారు.

ఘనంగా వీరభద్రుని సంబరం

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువు గ్రామంలో వీరభద్రుని బోనాల సంబరం ఘనంగా జరిగింది. వీరభద్రుని పీఠ నిర్వాహకులు కామన సీతా భవానీ (దేవుడమ్మ), నేతికొండ వీరన్నబాబుల ఆధ్వర్యంలో 26వ బోనాల మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. వందలాది మంది భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొని స్వామివార్లకు బోనాలు పోశారు. ఆధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్ శంకర్‌గౌడ్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ రాజులపూడి భీముడు, కామన కృష్ణ మాధవరావులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో భక్తులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో కలం పూజ

అమలాపురం టౌన్: స్వయంభూగా, పెళ్లిళ్ల వెంకన్నగా పేరు గాంచిన స్థానిక వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి సన్నిధిలో సోమవారం ఉదయం కలం పూజ కన్నుల పండువగా జరిగింది. వసంత పంచమి, శ్రీచక్రం, సుదర్శన మూర్తి వార్షికోత్సవం సందర్భంగా కలం పూజతో పాటు సుదర్శన హోమాన్ని అర్చక స్వాములు నిర్వహించారు. దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజాదికాలు జరిగాయి. స్వామి సన్నిధిలో పూజలు చేసిన పెన్నులను విద్యార్థులకు పంచిపెట్టారు. కలం పూజతో పాటు సుదర్శన హోమాన్ని భక్తులు ఆద్యంతం తిలకించి తరించారు.

రహదారి సౌకర్యం కల్పించాలి

అమలాపురం రూరల్: మండలంలోని జనుపల్లి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీ మహిళలు సోమవారం తహసీల్దార్ పలివెల అశోక్ ప్రసాద్‌ను కోరారు. కాలనీ ఏర్పాటై 20 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ రాకపోకలకు దారి కల్పించలేదని వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కలెక్టర్‌కు సైతం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

ఘనంగా బల్లల పండుగ

యానాం: యానాం నియోజకవర్గ రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం పల్లకీపై శివుడిని ఊరేగిస్తూ బల్లల పండుగను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి అనంతరం ఏడాదికి ఒకసారి బల్లల పండుగను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జనవరి నెలలో 15 రోజుల పాటు కుల వృత్తిని గౌరవించుకుంటూ బల్లల పండుగను నిర్వహించుకుంటామని ఆ రోజుల్లో నదులు, చెరువులు, కాలువల వద్ద బట్టలు ఉతికే బల్లలు పెట్టి పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారని సంఘ నాయకులు తెలిపారు.

లక్ష డప్పుల కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం

అమలాపురం రూరల్: ఎస్సీ వర్గీకరణ అమలుపై ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు, వేల గొంతుల కార్యక్రమాన్ని మాదిగలు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి పిలుపునిచ్చారు. నడిపూడిలో డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్ కమ్యూనిటీ భవనంలో సోమవారం జరిగిన మాదిగల ఆత్మీయ సమావేశం నియోజకవర్గ ఇంచార్జ్ అకుమర్తి రమేష్ అధ్యక్షత జరిగింది. భైరవమూర్తి మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో మాదిగలు తరలి రావాలని కోరారు.

లభ్యం కాని వాహనదారుల ఆచూకీ

అమలాపురం రూరల్: తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో వేర్వేరు ప్రదేశాలలో వాహన యజమానులు వివిధ కారణాలతో మోటారు సైకిళ్లను వదిలి వేయడం జరిగిందని ఎస్సై శేఖర్ బాబు తెలిరు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా యజమానుల గురించి ఎటువంటి సమాచారం లభించలేదన్నారు. వాహనాల సమాచారాన్నినోటీసు బోర్డులో జత చేయడం జరిగిందన్నారు. వాహన యజమానులు ఎవరైనా ఉన్నట్లయితే తమ వాహనాల పత్రాలతో వచ్చి సంప్రదించాలని కోరారు.

పైపులైను కోసం చెట్ల నరికివేత

యానాం: పట్టణ పరిధిలో తాగునీటి పైపులైను కోసం గోపాల్ నగర్ రహదారికి రోడ్డు పొడవునా ఎన్నో ఏళ్లుగా ఉన్న పచ్చని చెట్లను నరికి వేస్తుండడంపై సోమవారం స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి వెంబడి పచ్చదనంతో కళకళలాడే చెట్లను నరికి వేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. చెట్ల నరికివేతను ఆపివేయాలని కోరారు.

కాలుష్యం కోరల్లో దుర్భర జీవనం

- పంట కాలువ డ్రెయిన్‌లోకి పరిశ్రమల వ్యర్థాలు
- ప్రబలుతున్న ప్రమాదకర వ్యాధులు
- అసంపూర్తిగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం
- ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న దొమ్మేటిపేట గ్రామస్తులు


పారిశ్రామిక వ్యర్థాలతో నిండిన పంట కాలువ డ్రెయిన్


అసంపూర్తిగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం

యానాం: రసాయనిక వ్యర్థాలతో కూడిన కాలుష్యం వెదజల్లే ప్రాంతంలోనే వారి జీవనం. అయినా అక్కడే శాశ్వత నివాసాలు ఏర్పాటు చేసుకుని బతుకులు వెళ్లదీస్తున్నారు. ఇక్కడ డ్రెయిన్‌ను తొలగించాలని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలకు తమ గోడు వెళ్లబోసుకుంటున్నా పట్టించుకునేవారే కరవయ్యారు. ఇదీ యానాం శివారు దొమ్మేటిపేట ఇండస్ట్రియల్ కాలనీ వాసుల ఎన్నో ఏళ్ల ఆవేదన.

నియోజకవర్గ శివారు దొమ్మేటిపేట గ్రామంలో పలు పరిశ్రమలను గతంలో స్థాపించారు. ప్రస్తుతం ఇక్కడ అట్టల తయారీ ఫ్యాక్టరీలు, రైస్ మిల్లులు, గోదావరి కాస్టింగ్స్ తదితర పరిశ్రమలను నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా వెలువడే రసాయనిక వ్యర్థాలను దొమ్మేటిపేటలోని పంట కాలువ డ్రెయిన్‌లోనికి వదిలేస్తున్నారు. డ్రెయిన్ పక్కనే కొన్నేళ్లుగా శాశ్వత గృహాలు నిర్మించుకొని సుమారు 700 కుటుంబాలు జీవిస్తున్నాయి. ఈ రసాయనిక వ్యర్థాలతో కూడిన దుర్వాసనతో వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వ్యాధులతో మరణాలు

రసాయనిక వ్యర్థాల ద్వారా వచ్చే దుర్వాసనను భరిస్తూ అక్కడే నివాసం ఉంటున్నవారు వివిధ వ్యాధులకు గురై మృతి చెందుతున్నారంటే పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. ముఖ్యంగా శ్వాసకోశ, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులు, చర్మ వ్యాధులకు ఎక్కువగా గురవుతున్నారు. వీరిలో వృద్ధులే కాక మధ్య వయస్కులు సైతం ఉన్నారు. ఇంట్లో నిత్యం వాడుకునే వస్తువులు ముఖ్యంగా రాగి, అల్యూమినియం, స్టీలు తదితర వస్తువులు రంగు మారి నల్లబడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

సమస్య పరిష్కారానికి కృషి

వివిధ పరిశ్రమల ద్వారా వచ్చే వ్యర్థ జలాలు దొమ్మేటిపేట గ్రామంలోని పంట కాలువ డ్రెయిన్ లోనికి వస్తున్నాయి. ఈ సమస్యపై ఇప్పటికే పుదుచ్చేరి డ్రెయినేజీ విభాగం, పీడబ్ల్యూడీ అధికారులతో మాట్లాడాను. వ్యర్థాలను పంట కాలువ డ్రెయిన్‌లోనికి వదలడం ఆపాలని ఆదేశించాను. సమస్య త్వరలో పరిష్కారమవుతుంది.

గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఎమ్మెల్యే, యానాం.

గాలి, నీరు కలుషితం

పరిశ్రమలు వదిలే వ్యర్థ జలాలతో డ్రెయినేజీ నిండిపోయి తెట్టులా బయటకు వస్తోంది. డ్రెయినేజీ నీటితో పాటు వచ్చే గాలి సైతం కలుషితమవుతోంది. స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారు. సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలి.

జనిపల్లి వెంకన్నబాబు, దొమ్మేటిపేట.

అసంపూర్తి నిర్మాణంతో అవస్థలు

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించేలా రూ.67 లక్షల మున్సిపాలిటీ నిధులతో అండర్ గ్రౌండ్ నిర్మాణం చేపట్టినప్పటికీ ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగానే ఉండి పోయింది. ప్రస్తుతం ఉన్న డ్రెయిన్‌లోనికి ప్రవహిస్తున్న రసాయనిక వ్యర్థాల జలాలను మళ్లించి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ద్వారా సుమారు కిలోమీటరు దూరం తరలించి పంపింగ్ ద్వారా బయటకు తరలించడానికి రూ.80 లక్షలతో దీని నిర్మాణాన్ని ప్రారంభించారు. 2016లో పనులు ప్రారంభమైనప్పటికీ ఇంకా నిర్మాణం పూర్తి కాలేదు. ఆ నిధులు దారి మళ్లాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో ఏళ్లు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిభ చూపే క్రీడాకారులకు ఉజ్వల భవిత


ఐబీబీఎఫ్ అధ్యక్షుడు రమేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకన్నాయుడు, ప్రతినిధులు

ఐబీబీఎఫ్ అధ్యక్షుడు రమేష్‌కుమార్

అమలాపురం టౌన్: క్రీడా రంగం ఏదైనా ప్రతిభ చాటే క్రీడాకారులకు ఉపాధి అవకాశాలు అవలీలగా దరి చేరతాయని తెలంగాణా రాష్ట్రం ఖమ్మం పట్టణానికి చెందిన ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ (ఏబీబీఎఫ్) అధ్యక్షుడు స్వామి రమేష్ కుమార్ అన్నారు. ఆంధ్ర రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం ఉదయం అమలాపురానికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక వంటెద్దువారి వీధిలో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మే నెలలో జరగబోయే జాతీయ, అంతర్జాతీయ బాడీ బిల్డింగ్ పోటీల నిర్వహణపై చర్చించారు. క్రీడాకారులకు ఫెడరేషన్ కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను వివరించారు. జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా రాష్ట్ర, జాతీయ పోటీలు నిర్వహిస్తున్న అసోసియేషన్ ప్రతిధులను రమేష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా అసోసియేషన్ తరఫున జిల్లా అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు. జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, కోశాధికారి దొమ్మేటి వెంకటరమణ, కోచ్‌లు కంకిపాటి వెంకటేశ్వరరావు, ఎంవీ సముద్రం, అసోసియేషన్ ప్రతినిధులు వి.నరేష్, సీహెచ్.రాంబాబు, నార్ని శ్రీను తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి వేడుకలు


యానాంలో సామూహిక అక్షరాభ్యాసాలు

యానాం: వసంత పంచమిని పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలోని పలు ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్థానిక గోపాల్ నగర్‌లో కొలువైన సరస్వతీ ఆలయంలో ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలతో పాటు పళ్ల రసాలతో దివ్యాభిషేకం, కుంకుమార్చన, చామంతుల పూజలను నిర్వహించారు. అంతకుముందు సకల విద్యలకు అక్షర స్వరూపిణియైన అమ్మవారి సన్నిధిలో సరస్వతీ హోమం నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం విద్యార్థులతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.


విశేష అలంకరణలో సరస్వతీదేవి

అమలాపురం టౌన్: స్థానిక విద్యానిధి స్కూలులో వసంత పంచమి పూజలు సోమవారం వైభవంగా జరిగాయి. కొందరు చిన్నారులు వీణలను చేతపట్టి సరస్వతీ దేవి వేషధారణలో అందర్నీ అలరించారు. విద్యార్థులంతా సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో స్కూలు కరస్పాండెంట్ ఏ.శ్యామల మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


అమలాపురంలో వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు జట్ల ఎంపిక

తాళ్లరేవు: కాకినాడ జిల్లాలో సాఫ్ట్ టెన్నిస్ సబ్ జూనియర్ బాల, బాలికల జట్లను సోమవారం స్థానిక చొల్లంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపిక చేశారు. కాకినాడ జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపిక పోటీల్లో జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 30 మంది బాలికలు, 50 మంది బాలురు పాల్గొన్నారు. ఈ ఎంపిక పోటీలు టెన్నిస్ అసోషియేషన్ కార్యదర్శి నీలిమ పర్యవేక్షణలో జరిగింది.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8, 9 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ధనలక్ష్మీ కుమారి, రాజేశ్వరి, అసోషియేషన్ అధ్యక్షుడు సాయిబాబా, హెచ్ఎం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన బాల బాలికల జట్లు

ఫీజు పోరు ధర్నాను విజయవంతం చేయాలి

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



అల్లవరం: ఈ నెల 5న అమలాపురం జిల్లా కలెక్టరేట్ వద్ద వైఎస్సార్ సీపీ జరప తలపెట్టిన ఫీజు పోరు ధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులే కాక ఫీజు రియంబర్స్‌మెంట్ బాధితులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ ధర్నాలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ సోమవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. ఫీజు రియంబర్స్‌మెంట్ బాధిత విద్యార్థులకు తమ పార్టీతో పాటు పార్టీ అధినేత వైఎస్ జగన్ అండగా ఉంటారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం విద్యార్థులకు అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాల ద్వారా నాణ్యమైన విద్యను అందించేదని గుర్తు చేశారు. ఇప్పుడు వచ్చిన కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, కళాశాల ఫీజులను రీఎంబర్స్‌మెంట్ ద్వారా చెల్లిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు దాదాపు రూ.3,900 కోట్ల బకాయిలు చెల్లించకుండా విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

డీఎస్సీపై సీఎం చంద్రబాబు ప్రకటన సరికాదు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి గౌతమ్

అమలాపురం టౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి విడుదలైన నోటిఫికేషన్‌కు రెండు రోజుల ముందు డీఎస్సీ అభ్యర్థులను ప్రభావితం చేసేలా ఈ ఎన్నికలు పూర్తి కాగానే డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడం సరికాదని ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి కొల్లు గౌతమ్‌బాబు ఆక్షేపించారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో అధికార కూటమి ప్రభుత్వం ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం అడ్డదారులు తొక్కుతోందని ఆరోపించారు. ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి ఓటు వేసి తీరాలని డీఎస్సీ అభ్యర్థులను బెదిరించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో ఆరు జిల్లాలు ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ అభ్యర్థులు జిల్లా కేంద్రం ఏలూరులోనే నామినేషన్ల దాఖలు చేయాలని అనడం సరి కాదన్నారు. ఏలూరు కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలుకు వెళ్లాలంటే తూర్పు గోదావరి ఉమ్మడి జిల్లాల్లోని అభ్యర్థులు 100 నుంచి 200 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ విధానంపై ఉన్నతాధికారులు పునరాలోచించాలని గౌతమ్ బాబు విజ్ఞప్తి చేశారు.

ట్రాఫిక్‌కు అవరోధం కల్పిస్తే చర్యలు తప్పవు

అమలాపురం టౌన్: పట్టణంలో ట్రాఫిక్ అధికంగా ఉండే హైస్కూలు సెంటరు నుంచి కాలేజీ రోడ్డు జాతీయ రహదారి వరకు ట్రాఫిక్‌కు అవరోధం కలిగించేలా దుకాణాదారులు వ్యాపారాలు చేస్తే సహించేది లేదని పట్టణ సీఐ పి.వీరబాబు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం పోలీసు సిబ్బందితో హైస్కూలు సెంటరు నుంచి కాలేజీ రోడ్డు వరకు సీఐతో పాటు పట్టణ ఎస్సై తిరుమలరావు, ట్రాఫిక్ ఎస్సై ఏడుకొండలుతో కలిసి నడుచుకుంటూ వెళ్లి వ్యాపారులకు పలు సూచనలు చేశారు. రోడ్డు మార్జిన్‌లోపే దుకాణాలు, వ్యాపారాలను నిర్వహించుకోవాలని అవగాహన కల్పించారు. వ్యాపారుల తీరులో మార్పు రాకపోతే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. కొన్ని దుకాణాలకు సంబంధించి తమ వ్యాపార బోర్డులు రోడ్డు మార్జిన్‌లో పెట్టడంతో పోలీసులు అభ్యంతరం చెప్పి వాటిని వ్యాపారులతోనే తీసివేయించారు.


అమలాపురం హైస్కూల్ సెంటర్ రోడ్డులో కలియ దిరుగుతున్న సీఐ వీరబాబు, ఎస్సైలు

కమల సేవా దృక్పథం ప్రశంసనీయం

తాళ్లరేవు: 20 ఏళ్లుగా ప్రజాసేవ చేస్తూ అనాథ పిల్లలను దత్తత తీసుకుని వారికి సేవలు అందిస్తున్న విశ్వజన కళామండలి రాష్ట్ర మహిళా సభ్యురాలు మెండి కమల సేవలను పలువురు ప్రశంసించారు. సోమవారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో విశ్వజన కళామండలి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళా సభ్యురాలు మెండి కమల సత్కారసభ రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, భష్యం సత్యనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గెద్దం శ్రీనివాస్, బాలరాజు, అత్తిలి బాబూరావు, ఉంగరాల బూరిబాబు, పాల్గొన్నారు.


కమలను సత్కరిస్తున్న ప్రజా సంఘాలు, విశ్వజన కళామండలి సభ్యులు

హోటల్ నిర్వాహకుడికి జరిమానా

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం ముస్లిం వీధిలో గల ఢిల్లీ దర్బార్ హోటల్‌ను వార్డు సచివాలయ పర్యావరణ, పారిశుధ్య కార్యదర్శి బండి వీరన్న, సిబ్బంది సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటల్‌లోని వంటగది అపరిశుభ్రతతో ఉండడాన్ని గుర్తించారు. హోటల్‌లో వచ్చే వ్యర్థాలను పక్కనే పారుతున్న డ్రెయినేజీలో పడేస్తూ పారిశుధ్య సమస్యకు హోటల్ నిర్వాహకులు కారణమవుతున్నారని కార్యదర్శి గమనించారు. దీంతో హోటల్ యాజమాని మహ్మద్ ఆజామ్‌కు రూ.6 వేలు జరిమానా విధించారు. ఇకపై వ్యర్థాలను డ్రెయినేజీలో పడేస్తే ఉపేక్షించేది లేదని కార్యదర్శి వీరన్న హోటల్ యాజమాన్యాన్ని హెచ్చరించారు.

ఘనంగా మహా సౌరయాగం

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామంలోని శ్రీరామ మందిరంలో మాఘమాసం సందర్భంగా నిర్వహిస్తున్న నవగ్రహ నక్షత్ర పూర్వక మహా సౌరయాగం 5వ రోజున సోమవారం ఘనంగా జరిపారు. యాగ కర్త మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సూర్య భగవానుడికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీ చక్ర నవావరణార్చన, చండీహోమం, రాజశ్యామల అమ్మవారి హోమం నిర్వహించారు. పండితులు వారణాసి కామేశ్వర శాస్త్రిచే భాగవత పురాణం, దెందులూరి సీతారామ శర్మచే భాగవత ప్రవచనం నిర్వహించారు.


విలసవిల్లిలో సూర్యారాధన చేస్తున్న యాగకర్త రామకృష్ణ శర్మ

పితానికి మాజీ సీఎం జగన్ పరామర్శ

ముమ్మిడివరం: మాతృ వియోగంతో బాధ పడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణను వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సోమవారం ఫోన్‌లో పరామర్శించారు. పితాని బాలకృష్ణ మాతృమూర్తి సత్యవతి ఇటీవల మృతి చెందారు. ముమ్మిడివరం మండలం అనాతవరం శివారు శెట్టిపేటలోని స్వగృహంలో ఉన్న పితానిని జగన్‌మోహన్ రెడ్డి ఫోన్‌లో పరామర్శించి ఓదార్చారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పితాని బాలకృష్ణకు పలువురి పరామర్శ

తాళ్లరేవు: మాతృ వియోగంతో బాధ పడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణను సోమవారం తాళ్లరేవు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాదా గోవింద కుమార్ తదితరులు పరామర్శించారు. కార్యక్రమంలో కోటికలపూడి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రమాద బీమా అందజేత

ముమ్మిడివరం: ఇటీవల ప్రమాద వశాత్తూ మృతి చెందిన టీడీపీ కార్యకర్త కొడమంచిలి సత్యనారాయణ కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా చెక్కును ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సోమవారం అందజేశారు. టీడీపీ సహాయ నిధి నుంచి మృతుని కుటుంబానికి రూ.2 లక్షల బీమా మంజూరైంది. కార్యక్రమంలో కురసాల శివబాబు, గేదెల్లంక నీటి సంఘం అధ్యక్షులు జమి, ఖండవిల్లి ఏలియా, జనకోటి రాజు, కొడమంచిలి చంటి, సూరిబాబు, రమేష్ పాల్గొన్నారు.

108 అంబులెన్స్, ఆటో ఢీ: ముగ్గురికి గాయాలు

ముమ్మిడివరం: అమలాపురం నుంచి కాకినాడ వెళ్తున్న 108 అంబులెన్స్‌ను కాకినాడ నుంచి అమలాపురం చేపల లోడుతో వస్తున్న ట్రక్ ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురికి స్వల్ప గాయలయ్యాయి. ముమ్మిడివరం బైపాస్ రోడ్డు క్రాప చింతలపూడి జంక్షన్‌లో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ట్రక్ ఆటో డ్రైవర్ పేరూరి నాగ వెంకటేశ్వరరావుకు గాయాలు కాగా కాకినాడ ఆసుపత్రికి తరలించారు. 108 అంబులెన్స్ డ్రైవర్, టెక్నీషియన్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలి


షేక్ అబ్దుల్ ఖాదర్

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోతున్న వక్ఫ్ బోర్డు బిల్లును వ్యతిరేకించాలని, వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలని జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్, జిల్లా వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్ డిమాండ్ చేశారు. అమలాపురంలో ఆయన ఈ మేరకు సోమవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రెండు పడవల్లో కాళ్లు అన్నట్లుగా డబుల్ గేమ్ ఆడుతోందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డును, దాని ఆస్తులను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తొలి నుంచి ముస్లిం సమాజ హితం కోరుతున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన హయాంలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగారాని గుర్తు చేశారు. వక్ఫ్ సవరణ బిల్లు విషయంలో టీడీపీ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. బోర్డులో అన్య మతస్తులను చేర్చే దిశగా చట్టాన్ని రూపొందిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కలెక్టర్లకు పూర్తి అధికారాలు ఇచ్చేలా చట్టం రూపొందిస్తున్నారని ఖాదర్ ఆరోపించారు.

ఐఏఎస్ అధికారులకు అదనపు బాధ్యతలు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా పలువురు ఐఏఎస్ అధికారులకు పోర్టు పోలియోల్లో మార్పులతో పాటు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శరత్ చౌహాన్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత ప్రధాన ఎన్నికల అధికారి, ఐఏఎస్ అధికారి జవహర్‌కు అదనంగా పరిశ్రమలు, వాణిజ్యం, ఫారెస్ట్ అండ్ వైల్డ్ లైఫ్, విద్య, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ శాఖలు, ఏ ముత్తమ్మకు ప్లానింగ్ అండ్ రీసెర్చ్, విద్యుత్, సివిల్ సప్లయిస్, పబ్లిక్ వర్క్స్, ఏడీ వెల్ఫేర్, ఐటీ శాఖలు, మణికందన్ కు టూరిజమ్ అండ్ ఫిషరీస్, సుందరేశన్‌కు సోషల్ వెల్ఫేర్, బీసీ, మైనారిటీ సంక్షేమం, ఆర్థిక, స్టాటిస్టిక్స్, యూత్ ఎఫైర్స్, జయంత కుమార్‌కు పుదుచ్చేరి స్మార్ట్ సిటీ డెవలెప్‌మెంట్, నెడుంజలియన్‌కు వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ, కేశవన్‌కు లోకల్ అడ్మినిస్ట్రేషన్, విజిలెన్స్, ఫైర్, కొలుంగొత్తన్‌కు రూరల్ డెవలెప్‌మెంట్, డీఆర్‌డీఏ, సోమశేఖర్ అప్పారావుకు కారైకల్ జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యం

యానాం: 2026లో పుదుచ్చేరి అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమని ఇప్పటికే లోక్‌సభ స్థానాన్ని కైవసం చేసుకుని ప్రజాదరణ కలిగి ఉన్నామని మాజీ సీఎం నారాయణసామి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖలపై వస్తున్న ఆరోపణలు, అక్రమాల గురించి ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించడం లేదని విమర్శించారు. ఎంపీ వైతిలింగం మాట్లాడుతూ బడా పారిశ్రామిక వేత్తలకు బీజేపీ ప్రభుత్వం అనుకూలంగా పని చేస్తుందని ఆరోపించారు. పుదుచ్చేరి విద్యుత్ సెక్టార్‌ను దశలవారీగా హస్తగతం చేసుకునేందుకు పలు ప్రైవేట్ కంపెనీలు వస్తుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల హక్కులను కాపాడటానికి కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు.